Follow: @ANNTELUGU

27-08-2026

ANN తెలుగు

# మహా పత్రిక

గురువారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 233 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



29న మారెళ్ళపాడు ఎత్తిపోతల పథకం

# ప్రారంభం

- హాజరుకానున్న మంత్రులు ఉత్తమ్, తుమ్మల, పొంగులేటి
- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వెల్లడి.. ఏర్పాట్లు పరిశీలన

**అశ్వాపురం, మహా :** అశ్వాపురం మండలం మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం ఈనెల 29న రాష్ట్రమంత్రుల చేతులమీదుగా ప్రారంభమవుతుందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రాజెక్టులో భాగంగా జరుగుతున్న పనులను ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులు తుది దశకు చేరుకున్నాయని, మిగిలి ఉన్న పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అధికారులు పనులను వేగవంతం చేస్తూ నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని,

మిగతా 2వ పేజీలో

టాప్ న్యూస్

## నేపాల్‌లో వరద బీభత్సం

- వెయ్యి మందికిపైగా గల్లంతు!
- గల్లంతైన వారిలో 105 మంది భారతీయులు.
- సహాయక చర్యలకు 15 హెలికాప్టర్లు



03

## ట్రాఫిక్ ఉల్లంఘనులకు పోలీసుల షాక్

- చలాన్లు కట్టకపోతే ఫాస్టాగ్ నుంచి డబ్బులు కట్
- హైదరాబాద్ పోలీసుల బిగ్ ప్లాన్!




02

## భారత్‌లో మ్యాక్‌బుక్, ఐప్యాడ్ తయారీకి కేంద్రం చర్చలు

స్థానిక విడిభాగాల సరఫరా వ్యవస్థపై కేంద్రం దృష్టి



02




## రవితేజ 'ఇరుముడి' కోసం థియేటర్ ముందు ధర్నా

- సినిమా ఆపేశారని మక్తల్‌లో ఫ్యాన్స్ ఆందోళన


**మక్తల్, మహా :** సినిమా చూడటానికి థియేటర్‌కు వెళ్లడం కామన్.. కానీ సినిమా వేయలేదని అదే థియేటర్ ముందు ధర్నాకు దిగడం మాత్రం వెరీ వెరీ రేర్. నారాయణపేట జిల్లా మక్తల్‌లో ఇప్పుడు ఇదే సీన్ కనిపించింది. వెంకటరమణ థియేటర్ ముందు బుధవారం ఉదయం ఒక్కసారిగా ప్రేక్షకులు, అయ్యప్ప భక్తులు, చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన సినీ ప్రియులు బైఠాయించారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గత ఐదు రోజులుగా ఈ థియేటర్‌లో రవితేజ నటించిన 'ఇరుముడి' హౌస్‌ఫుల్ షోలతో దూసుకెళ్తోంది. టికెట్ల కోసం జనం


మిగతా 2వ పేజీలో

# కౌశిక్ రెడ్డిపై అనర్హత వేటు?


ఎథిక్స్ కమిటీ భేటీపై ఉత్కంఠ

- 29న కౌశిక్ వ్యవహారంపై చర్చించేందుకు కీలక సమావేశం
- కడియంను తుపాకితో కాల్చేస్తామని సైగలు చేశారని మండిపడ్డ అధికారపక్షం





**హైదరాబాద్, మహా :** తెలంగాణ శాసనసభ నైతికత (ఎథిక్స్) కమిటీ కీలక సమావేశం ఈనెల 29న ఉదయం 11 గంటలకు అసెంబ్లీ భవనంలోని కమిటీ హాల్‌లో జరగనుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి , కడియం శ్రీహరిపై చేసిన అనైతిక ప్రవర్తన, అనుచిత వ్యాఖ్యల వ్యవహారంపై ఈ భేటీలో కమిటీ విచారణ జరపనుంది. గత అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా కడియం శ్రీహరిపై పాడి కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు, ప్రవర్తించిన తీరుపై అధికార పక్షం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. దీంతో ఈ వ్యవహారాన్ని సమగ్ర విచారణ కోసం స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నైతికత కమిటీకి సమీక్షకు పంపించారు. ఈ మేరకు విచారణను వేగవంతం చేస్తూ, శాసనసభ కార్యదర్శి తిరుపతి ఈ సమావేశానికి సంబంధించి




# ఖర్గేతో భట్టి భేటీ

- క్రమశిక్షణాకమిటీ నివేదికపై 40 నిమిషాల పాటు చర్చలు
- ఖర్గే పిలుపుతో హుటాహుటిన బెంగళూరుకు భట్టి
- ఉదయమే భట్టిని కలిసిన రాజగోపాల్ రెడ్డి, కొండా మురళి

**హైదరాబాద్, మహా :** తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. మంత్రి కొండా సురేఖ , ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డి వ్యవహారంపై టీపీసీసీ క్రమశిక్షణా కమిటీ చైర్మన్ మల్లు రవి ఇచ్చిన నివేదిక ఏఐసీసీ కి చేరిన నేపథ్యంలో తర్వాత పరిణామాలపై ఉత్కంఠ నెలకొంది. తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క హుటాహుటిన బుధవారం సాయంత్రం బెంగళూరుకు బయలుదేరి వెళ్లడం రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యతను సంతరించుకుంది. బెంగళూరులో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రత్యేకంగా సమావేశమయ్యారు. 40 నిమిషాల పాటు ఈ భేటీ జరిగింది. క్రమశిక్షణా కమిటీ సమర్పించిన నివేదిక ఆధారంగా మంత్రి కొండా సురేఖ, చిన్నారెడ్డిలపై ఎలాంటి క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలి, సస్పెన్షన్ వేటు వేయాలనే అంశంపై ఈ సమావేశంలో చర్చించినట్లు తెలుస్తోంది. ఖర్గే పిలుపుతోనే భట్టి బెంగళూరు వెళ్ళినట్లు తెలుస్తోంది. లక్ష్మణ రేఖ దాటిన నేతలపై ఏఐసీసీ కఠిన చర్యలు తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. కొండా సురేఖ, చిన్నారెడ్డిలపై ఎలాంటి నిర్ణయం తీసుకోనున్నారనే అంశంపై అధిష్ఠానం మరికొన్ని గంటల్లోనే అధికారిక ప్రకటన విడుదల చేసే అవకాశం ఉంది.

**కొండా రాయబారం**

హైదరాబాద్‌లోని ప్రజాభవన్ లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను బుధవారం మధ్యాహ్నం కొండా సురేఖ భర్త కొండా మురళీతో పాటు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కలిశారు. వివాదాన్ని సర్దుమణిగేలా చూసి, పార్టీ కఠిన నిర్ణయాలు తీసుకోకుండా ఉండేందుకు భట్టి సమక్షంలో చర్చలు జరిపినట్లుగా తెలుస్తోంది. ఈ భేటీ జరిగిన కొన్ని గంటల్లోనే డిప్యూటీ సీఎం ఉన్నట్లుండి బెంగళూరుకు పయనం కావడంపై పార్టీ శ్రేణుల్లో ఉత్కంఠ నెలకొంది. నేతల భేటీ సారం చెప్పేందుకు వెళ్ళారా? ముందే ఖర్గేను కలవబోతున్నారని తెలిసే ఇద్దరు నేతలు భట్టిని కలిశారా? అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది. కాగా ఏఐసీసీకి అందిన నివేదిక భట్టి అభిప్రాయం తర్వాత తుది ప్రకటన ఏఐసీసీ నుండి వచ్చే అవకాశాలున్నాయి.



## టాక్సిక్.. టార్చర్

- సినిమాపై ప్రేక్షకుల పెదవిరుపు
- దిల్ రాజుకు మరో షాక్

**హైదరాబాద్, మహా :** టాక్సిక్ ప్రేక్షకులకు టార్చర్ గా మారగా, ఇది చూసిన వారికే కాకుండా భారీ సినిమా అని ఫ్యాన్సీరేటకు కొన్న దిల్ రాజుకు కూడా అదే ఫీలింగ్ మిగిల్చింది. యశ్ 'కేజీఎఫ్' తర్వాత ద్విపాత్రాభినయం చేస్తూ, నిర్మాణ భాగస్వామిగా వ్యవహరించిన 'టాక్సిక్'పై భారీ

మిగతా 2వ పేజీలో




## అఖిల పావనికి నారా లోకేష్ అభినందనలు

- రాయలసీమ జెన్ స్టార్స్ కు ఎంపికైన మంగళగిరి క్రికెటర్

**మంగళగిరి, మహా :** ఉమెన్స్ ఆంధ్ర ప్రీమియర్ లీగ్ తొలి సీజన్‌కు రంగం సిద్ధమవుతున్న వేళ, మంగళగిరికి చెందిన యువ క్రికెటర్ వాసవి అఖిల పావని 'రాయలసీమ జెన్ స్టార్స్' జట్టుకు ఎంపిక కావడం పట్ల రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ మరియు మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేష్ హర్షం వ్యక్తం చేశారు. టోర్నమెంట్‌లో పాల్గొంటున్న క్రీడాకారిణులందరికీ ఆయన తన అభినందనలు తెలిపారు. ఏపీఎల్ ఉమెన్ క్రికెట్ లీగ్ ఆటగాళ్ల వేలంలో మంగళగిరికి చెందిన వాసవి అఖిల పావనిని రాయలసీమ జెన్ స్టార్స్ జట్టు దక్కించుకుంది. స్థానిక ప్రాంతానికి చెందిన యువతి రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో అవకాశం దక్కించుకోవడం పట్ల స్థానికంగా హర్షం వ్యక్తమవుతోంది.

## కోదాడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- కంటైనర్‌ను ఢీకొట్టిన ప్రైవేట్ బస్సు
- అక్కడికక్కడే ఆరుగురు మృతి మరో 20 మందికి గాయాలు


03



## సుస్మిత వ్యాఖ్యలతో మాకు సంబంధం లేదు

- కాంగ్రెస్‌లోనే కొనసాగుతా.
- భట్టి విక్రమార్కతో ఎలాంటి చర్చ జరగలేదు
- కొండా మురళి

03



ప్రతిష్ఠాత్మకంగా గ్లోబల్ సమ్మిట్ 2.0 02

'ఖేలో ఇండియా యూత్ గేమ్స్'కు

## తెలంగాణ ఆతిథ్యం

- కేంద్ర క్రీడామంత్రిత్వ శాఖ సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- రూ.22 కోట్లు విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వం
- హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్ లలో పోటీల నిర్వహణ
- దేశం నలుమూలల నుంచి పాల్గొననున్న 6వేలకు పైగా క్రీడాకారులు
- యువ క్రీడాకారులతో వర్చువల్‌గా మాట్లాడనున్న ప్రధాని నరేంద్రమోదీ

03









## రవితేజ 'ఇరుముడి' కోసం థియేటర్ ముందు ధర్నా

**( మొదటి పేజీ తరువాయి )**
భారీగా క్యూ కడుతున్నారు. కొందరికి టికెట్లు దొరకక వెనుదిరగాల్సి వస్తోందట. మంగళవారం రాత్రి కూడా పెద్ద సంఖ్యలో ప్రేక్షకులు థియేటర్‌కు వచ్చినా టికెట్లు దొరకలేదని చెబుతున్నారు. కనీసం బుధవారం అయినా సినిమా చూద్దాం అని ఆశగా వచ్చిన వారికి మాత్రం షాకింగ్ ట్విస్ట్ ఎదురైంది. ఉదయం థియేటర్ వద్దకు వచ్చేసరికి 'ఇరుముడి 'మూవీ స్థానంలో 'టాక్సిక్' ప్రదర్శనకు సిద్ధం కావడం ప్రేక్షకులను ఆగ్రహానికి గురిచేసింది. దీంతో సినిమా మళ్లీ వేయాల్సిందే అంటూ గేటు ముందు ధర్నాకు దిగారు. అవసరమైతే నేలపై కూర్చొని అయినా చూస్తామని, ఎంత రద్దీ ఉన్నా భరిస్తామని స్పష్టం చేశారు. అసలు ఎవరి ఒత్తిడితో 'ఇరుముడి 'ని తీసేశారో థియేటర్ యాజమాన్యం చెప్పాలని డిమాండ్ చేశారు.



## టాక్సిక్.. టార్చర్

**( మొదటి పేజీ తరువాయి )**
అంచనాలు నెలకొన్నాయి. మలయాళీ నటి గీతూ మోహన్ దాస్ ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. సినిమాను ప్రేక్షకులను తీవ్రస్థాయిలో డిసప్పాయింట్ చేసింది. టాక్సిక్ ఓ టార్చర్ గా మారిపోయింది. సినిమాపై పెట్టుకున్న భారీ అంచనాలు నిదానంగా కరిగిపోవడంతో థియేటర్లలో ప్రేక్షకులు అసహనంగా అరుపులు అరిచే పరిస్థితి వస్తుంది. అసలు ఏ పాత్ర ఎందుకు వస్తోందో? ఎందుకు వెళుతుందో? హీరోతో వాళ్ళకు ఉన్న వైరం ఏమిటో? ఎవరీ అర్థం కాదు. మరబొమ్మల్లా తెర మీద జరిగే సన్నివేశాలను ప్రేక్షకులు చూడాల్సిన పరిస్థితి. ఇలాంటి కథను చెప్పిన గీతూ మోహన్ దాస్‌ను నమ్మి, ఈ ప్రాజెక్ట్ ఆమె చేతిల్లో పెట్టిన యశ్, వెంకట్ నారాయణ టేస్ట్ కు, గట్స్ కు హ్యాట్సాఫ్ చెప్పాలంటున్నారు. టాక్సిక్' దెబ్బకు 'ఇరుముడి ' సినిమా కలెక్షన్స్ పెరిగి... అది అతి త్వరలోనే రూ. 200 కోట్ల క్లబ్‌లో చేరవచ్చని చెబుతున్నారు.



## భారత్‌లో మ్యాక్‌బుక్, ఐప్యాడ్ తయారీకి

### కేంద్రం చర్చలు

**ఢిల్లీ, మహా :** ఐఫోన్‌ల తయారీకి ఇప్పటికే కీలక కేంద్రంగా మారుతున్న భారత్‌ను యాపిల్ మరింత పెద్ద తయారీ హబ్‌గా మార్చాలని ప్రభుత్వం కోరుతోంది. అయితే ఐప్యాడ్‌లు, మ్యాక్‌బుక్‌లు, యాపిల్ వాచ్‌ల వంటి ఉత్పత్తుల పూర్తి స్థాయి తయారీకి ముందు దేశంలో స్థానిక విడిభాగాల సరఫరా వ్యవస్థను నిర్మించాలని యాపిల్‌పై ప్రభుత్వం ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం భారత్‌లో తయారవుతున్న ఐఫోన్‌లు, ఎయిర్‌ప్యాడ్‌లకే కాకుండా, ఇతర దేశాల్లోని యాపిల్ తయారీ కేంద్రాలకు ఎగుమతి చేయడానికి కూడా భారత్‌లో తయారైన విడిభాగాలను ఉపయోగించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. దీంతో యాపిల్ ప్రపంచ సరఫరా గొలుసులో భారత్ పాత్ర మరింత పెరగనుంది. ఇప్పటికే భారత కంపెనీలు పీసీబీల అసెంబ్లీలు, ఫ్లెక్సిబుల్ పీసీబీలు, మెటల్ ఎన్‌క్లోజర్లు, ఇతర యాంత్రిక భాగాలు, హౌసింగ్‌లు, గ్రాఫైట్ భాగాలు, వైర్లు, ప్యాకేజింగ్ మెటీరియల్స్ వంటి వాటిని తయారు చేస్తున్నాయి. వీటిలో కొన్ని భాగాలు ఇప్పటికే భారత్ నుంచి చైనా, వియత్నాం వంటి యాపిల్ తయారీ కేంద్రాలకు ఎగుమతి అవుతున్నాయి

# కౌశిక్ రెడ్డిపై అనర్హత వేటు?

**( మొదటి పేజీ తరువాయి )**
అధికారికంగా లేఖ జారీ చేశారు. ఈనెల 29న జరిగే సమావేశంలో కమిటీ చైర్మన్, సభ్యులు హాజరై ఈ ఘటనపై క్షుణ్ణంగా విచారించి, కౌశిక్ రెడ్డిపై తీసుకోవాల్సిన తదుపరి చర్యలకు సంబంధించి నివేదికతో పాటు సిఫారసులను రూపొందించనున్నారు. మార్చిలో ఈ సంఘటన జరగ్గా, నైతికత కమిటీకి చర్యల అంశాన్ని స్పీకర్ సిఫార్సుచేశారు. కడియం శ్రీహరి మాట్లాడుతున్న సమయంలో, కౌశిక్ రెడ్డి తన చేతులతో తుపాకితో కాల్చేస్తున్నట్లు సైగలు చేస్తూ, అసభ్యకరమైన సంజ్ఞలు చేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా సభలో పేర్కొన్నారు.

**ఇక చర్యలే**
కౌశిక్ రెడ్డి తీరుపై కాంగ్రెస్ దళిత , గిరిజన ఎమ్మెల్యేలు తీవ్రంగా మండిపడ్డారు. కడియం శ్రీహరి వంటి 40 ఏళ్ల అనుభవం ఉన్న సీనియర్ నేతను చంపుతా



మన్నట్లుగా సంజ్ఞలు చేయడం "గుండాగిరి" అని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ , ఎమ్మెల్యే వేముల వీరేశం ఆ సమయంలో ధ్వజమెత్తారు. గతంలో కేవలం నిరసన తెలిపినందుకే కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సంపత్ కుమార్ల సభ్యత్వాలను బీఆర్ఎస్ ప్రభుత్వం రద్దు చేసిన విషయాన్ని గుర్తు చేస్తూ, ఇప్పుడు కౌశిక్ రెడ్డి సభ్యత్వాన్ని కూడా తక్షణమే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. మొదట కౌశిక్ రెడ్డిని సభ నుంచి శాశ్వతంగా తొలగించాలని భావించినప్పటికీ, న్యాయపరమైన చిక్కులు రాకుండా ఉండటానికి ప్రభుత్వం నిబంధనల ప్రకారం ముందుకు వెళ్లాలని నిర్ణయించింది. కౌశిక్ రెడ్డి ప్రవర్తనపై సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని స్పీకర్ ఎథిక్స్ కమిటీని కోరారు. కౌశిక్ రెడ్డికి సంబంధించిన వీడియోలను ప్రభుత్వం ఇప్పటికే పరిశీలించింది , వాటిని కమిటీకి అందజేసింది. ఎథిక్స్ కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా కౌశిక్ రెడ్డిపై స్పీకర్ చర్యలు తీసుకోనున్నారు. గతంలో కోమటిరెడ్డి, సంపత్ ల తరహాలోనే సభ్యత్వరద్దుకు సిఫార్సుచేసే అవకాశముందని, లేదా ఈ టర్మ్ వరకు అసెంబ్లీకి రాకుండా చర్య తీసుకునే అవకాశముందన్న చర్చ ఉంది.

# ప్రతిష్టాత్మకంగా గ్లోబల్ సమ్మిట్ 2.0

**డిప్యూటీ సీఎం భట్టి, ఉత్తమ్, శ్రీధర్ బాబు**

హైదరాబాద్, మహా : . డిసెంబర్‌లో జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించి, రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించేలా పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికను అమలు చేయాలని అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజా భవన్‌లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2.0కు సంబంధించిన ఏర్పాట్లు, కార్యాచరణ ప్రణాళికలపై కేబినెట్ సబ్‌కమిటీ సమావేశం నిర్వహించగా, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు పాల్గొన్నారు. సమ్మిట్ ఏర్పాట్ల పర్యవేక్షణకు ప్రజా భవన్‌లో ప్రత్యేక వార్ రూమ్ ఏర్పాటు చేయడంతో పాటు, నిపుణులు, కీలక అధికారులతో కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. గత గ్లోబల్ సమ్మిట్‌లో కుదిరిన అవగాహన ఒప్పందాల పురోగతిని సమగ్రంగా సమీక్షించి, పెట్టుబడుల వాస్తవ కార్యరూపంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.



దేశీయంగా, అంతర్జాతీయంగా విస్తృత రోడ్‌షోలు నిర్వహించి పెట్టుబడిదారులను తెలంగాణకు ఆహ్వానించాలని, సమ్మిట్‌కు సంబంధించిన ప్రతి పనిని నిర్దేశిత కాలపరిమితిలో పూర్తి చేస్తూ, ఏర్పాట్లపై నిరంతర సమీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణను ప్రపంచ పెట్టుబడులకు అత్యుత్తమ గమ్యస్థానంగా నిలిపి, రాష్ట్ర ఆర్థిక ప్రగతికి కొత్త ఊపునివ్వడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు, ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తో పాటు సంబంధిత ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ ఉల్లంఘనులకు పోలీసుల షాక్

**హైదరాబాద్, మహా :** రోడ్లపై ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించి ప్రయాణించే వాహనదారులకు భారీ షాక్ ఇచ్చే దిశగా ట్రాఫిక్ పోలీసులు కీలక అడుగులు వేస్తున్నారు. వాహనాలపై పదుల సంఖ్యలో చలాన్లు, వేల రూపాయల పెండింగ్ ట్రాఫిక్ జరిమానాలు ఉన్నప్పటికీ కొంత మంది యథేచ్ఛగా ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడుతూనే ఉన్నారు. వాహనదారులను ట్రాఫిక్ రూల్స్ పాటించేలా చేసేందుకు చలాన్ ఫైన్లను భారీగా పెంచినప్పటికీ.. భారీగా బకాయిలు పెరిగిపోతున్నాయి తప్ప వాహనదారులు ట్రాఫిక్ ఉల్లంఘనల తీరు మాత్రం మారడం లేదు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ నగర పరిధిలో ట్రాఫిక్ నిబంధనలను పాటించని.. ట్రాఫిక్ చలాన్లు చెల్లించని వారి జేబులకు చిల్లు వేసేందుకు ట్రాఫిక్ పోలీసులు రెడీ అయ్యారు. ఒక వాహనంపై ఉన్న ట్రాఫిక్ చలాన్ల మొత్తాన్ని ఆ వాహనం ఫాస్టాగ్ అకౌంట్ నుంచి కట్ చేసే ప్రతిపాదనలను పరిశీలిస్తున్నారు.ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ఈచలాన్ల వసూళ్లను సులభతరం చేయడంతో పాటు.. ట్రాఫిక్ ఉల్లంఘనలను తగ్గించేందుకు ఫాస్టాగ్‌తో చలాన్ల వ్యవస్థను అనుసంధానం చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఈ విధానం అమల్లోకి వస్తే ట్రాఫిక్ ఉల్లంఘనలకు విధించే జరిమానాను సంబంధిత వాహనదారుడి ఫాస్టాగ్ ఖాతా నుంచి ఆటోమేటిక్‌గా మినహాయించే అవకాశం ఉంటుంది. దీనివల్ల వాహనదారులు మరింత జాగ్రత్తగా ట్రాఫిక్ రూల్స్ పాటిస్తారని పోలీసులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్‌సీఎస్‌సీ) వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సన్‌ప్రీత్ సింగ్.. ఈ ప్రతిపాదనకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.ఫాస్టాగ్ ద్వారా ట్రాఫిక్ చలాన్ల వసూలు చేసే అంశంపై హెచ్ఎండీఏ అధికారులతో చర్చలు జరుపుతున్నట్లు సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. అయితే ఈ విధానం అమలుకు సంబంధించిన తుది నిర్ణయం, నిబంధనలు, సాంకేతిక అనుసంధానంపై ఇంకా అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఉల్లంఘనలను కెమెరాలు, ఇతర టెక్నాలజీ వ్యవస్థల ద్వారా గుర్తించి వాహనాలకు ఈచలాన్లను జారీ చేస్తున్నారు. అయితే చాలామంది వాహనదారులు జరిమానాలను చెల్లించకుండా ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచుతున్నారని పోలీసులు గుర్తించారు. దీంతో చలాన్ల వసూళ్ల కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాల్సి వస్తోంది.ఈ నేపథ్యంలో ఫాస్టాగ్ వ్యవస్థతో ట్రాఫిక్ ఈచలాన్లను అనుసంధానం చేస్తే జరిమానా విధించిన తర్వాత నిర్దేశిత నిబంధనల ప్రకారం మొత్తాన్ని ఆటోమేటిక్‌గా వసూలు చేసే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. దీనివల్ల పెండింగ్ చలాన్ల సంఖ్య తగ్గడంతో పాటు, ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించే ముందు వాహనదారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఫాస్టాగ్ అనేది ప్రధానంగా ఫోర్ వీల్స్, ఆపైన భారీ వాహనాలకు మాత్రమే ఉంటుంది. కానీ బైక్‌లు, ఆటోలు వంటి వాహనాలకు ఫాస్టాగ్ ఉండదు. ఈ నేపథ్యంలోనే ఆ వాహనాలకు ఈ విధానం ఎలా వర్తిస్తుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. అలాగే ట్రాఫిక్ చలాన్ మొత్తాన్ని ఎప్పుడు కట్ చేస్తారు.. వాహనదారులకు ముందుగా సమాచారం ఇస్తారా తప్పుగా విధించిన చలాన్లపై అప్పీల్ చేసే అవకాశం ఉంటుందా వంటి అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు రావాల్సి ఉంది. హైదరాబాద్‌లో పెరుగుతున్న వాహనాల సంఖ్య, ట్రాఫిక్ రద్దీ, అక్రమ పార్కింగ్, రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత విస్తృతంగా వినియోగించాలని అధికారులు భావిస్తున్నారు. ప్రజా రవాణాను బలోపేతం చేయడం, లాస్ట్‌మైల్ కనెక్టివిటీని మెరుగుపరచడం, ప్రధాన ప్రాంతాల్లో మల్టీ లెవల్ పార్కింగ్ సదుపాయాలను పెంచడం వంటి చర్యలు కూడా అవసరమని సన్‌ప్రీత్ సింగ్ సూచించారు.



# 29న మారెళ్ళపాడు ఎత్తిపోతల పథకం ప్రారంభం

**( మొదటి పేజీ తరువాయి )**
పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, ఎలాంటి జాప్యం లేకుండా ప్రాజెక్టు పనులను ముందుకు తీసుకెళ్లాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, మారెల్లపాడు ఎత్తిపోతల పథకం ద్వారా ఈ నెలాఖరులోగా రైతులకు సాగునీరు అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు. 29న మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిల చేతులమీదుగా గోదావరి జలాలు నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తాయన్నారు. ప్రాజెక్టు పూర్తయితే రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. రైతులకు సాగునీరు అందించి వారి వ్యవసాయానికి భరోసా కల్పించడమే తన లక్ష్యమని, ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలోని ప్రజా ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు, మండల అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



# రెచ్చిపోతున్న సైబర్ కేటుగాళ్లు

- **ఆర్మీ మేజర్ భార్య ఫొటోల మార్ఫింగ్**
- **వేధింపులకు పాల్పడుతున్న సైబర్ ముఠా**

**హైదరాబాద్, మహా :** సైబర్ కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. రోజుకో తరహా మోసాలతో అమాయకులను నిండా ముంచుతున్నారు. తాజాగా ఓ ఆర్మీ మేజర్ భార్య ఫోటోలను మార్ఫింగ్ చేసిన సైబర్ ముఠా వేధింపులకు పాల్పడింది. ఈ ఘటనపై బాధితురాలి భర్త ఫిర్యాదు మేరకు హైదారాబాద్ సైబర్ పీఎస్‌లో కేసు నమోదైంది. సికింద్రాబాద్ నివాసి, ఆర్మీలో పని చేస్తున్న ఓ మేజర్ భార్య ఎయిర్ ఇండియా క్యాబిన్ క్రూలో విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల సైబర్ మోసగాళ్లు ఆమెను టార్గెట్ గా చేసుకొని సోషల్ మీడియాలోని ఆమె వ్యక్తిగత ఫొటోలు, వీడియోలను సేకరించి ఏఐ సాంకేతికతతో అసభ్యకరమైనవిగా మార్ఫింగ్ చేశారు.. ఆ ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేశారు. ఆమె బంధువులు, స్నేహితులు, కుటుంబ సభ్యులకు పోస్టులు పెడుతూ డబ్బులు ఇవ్వాలని బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు. దీంతో మేజర్ స్వయంగా ఓపెన్ సోర్స్ ఇంటెలిజెన్స్ సాంకేతిక పరికరాల ద్వారా పరిశోధన చేసి, నిందితులు ఉపయోగించిన సోషల్ మీడియా లింక్‌లను, అకౌంట్ల వివరాలతో సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. ఇటువంటి ఘటనలు జరిగితే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాలని సూచిస్తున్నారు.

## 29న మారెల్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రారంభం

**అశ్వాపురం, మహా :** తుమ్మలచెరువు ఆయకట్టు పరిధిలో సాగు చేస్తున్న రైతులకు శుభవార్త. రైతుల చిరకాల ఆకాంక్షగా ఉన్న మారెల్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ఈ నెల 29న ప్రారంభం కానుంది. రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ జిల్లా నాయకులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు.మారెల్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ అందుబాటులోకి రావడంతో తుమ్మలచెరువు ఆయకట్టు రైతులకు సాగునీటి సమస్యలు మరింతగా పరిష్కారమయ్యే అవకాశం ఉందన్నారు. ఈ పథకం రైతుల సాగునీటి అవసరాలను తీర్చడంలో కీలకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయకట్టు పరిధిలోని రైతులందరూ పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోమటిరెడ్డి వెంకటరెడ్డి కోరారు.

# కాళేశ్వరంపై కీలక మలుపు.. బాధ్యత రాష్ట్రానిదే!

- **ఆపరేషన్‌పై నిర్ణయం తెలంగాణదేనన్న ఎన్ డి ఎస్ ఏ, సి డబ్ల్యూ సి.**
- **పునరుద్ధరణ తర్వాతే వినియోగంపై నిపుణుల సూచనలు.**

**హైదరాబాద్, మహా:** తెలంగాణలో ప్రతిష్ఠాత్మకమైన కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు భవిష్యత్తుపై మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్వహణ, పునరుద్ధరణ, నీటిని ఎత్తిపోసే అంశాలపై తెలంగాణ హైకోర్టులో దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా కేంద్ర జల సంఘం , జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ తమ పరిధులు, రాష్ట్ర ప్రభుత్వ బాధ్యతలపై కీలక స్పష్టత ఇచ్చాయి. కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీలను ఎప్పుడు, ఏ పరిస్థితుల్లో నిర్వహించాలి, నీటిని ఎత్తిపోవాలా వద్దా అనే ఆపరేషనల్ నిర్ణయం రాష్ట్ర డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్, రాష్ట్ర ప్రాజెక్టు అధికారుల పరిధిలోనే ఉంటుందని కేంద్ర సంస్థలు హైకోర్టుకు తెలిపాయి. అయితే మేడిగడ్డలో తలెత్తిన సమస్యల నేపథ్యంలో నిర్మాణాన్ని పునరుద్ధరించి, అవసరమైన భద్రతా చర్యలు చేపట్టిన తర్వాతే ప్రాజెక్టును పూర్తి స్థాయిలో వినియోగించడం అవసరమని ఎన్ డి ఎస్ ఏ తన సాంకేతిక పరిశీలనల ఆధారంగా స్పష్టం చేసింది. దీంతో కాళేశ్వరం విషయంలో ఇప్పటివరకు కేంద్ర సంస్థల అనుమతి కోసం ఎదురుచూస్తున్నామన్న రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై బీఆర్ఎస్ ప్రశ్నలు లేవనెత్తగా, ప్రభుత్వం మాత్రం ప్రజా భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ శాస్త్రీయ, సాంకేతిక సిఫారసుల ఆధారంగానే ముందుకు వెళ్తామని చెబుతోంది.
కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ బ్యారేజీకి సంబం



ధించిన సమస్యలు 2023 అక్టోబర్‌లో బయటపడినప్పటి నుంచి ఈ భారీ సాగునీటి ప్రాజెక్టు భవిష్యత్తు తెలంగాణ రాజకీయాల్లో అత్యంత వివాదాస్పద అంశంగా మారింది. మేడిగడ్డ బ్యారేజీలో కొన్ని పిల్లర్లు కుంగిపోవడంతో ప్రాజెక్టు నిర్మాణ నాణ్యత, డిజైన్, పునాది, నిర్మాణ పద్ధతులు, నిర్వహణ, నీటి నిర్వహణ వంటి అంశాలపై కేంద్ర సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వాలు, నిపుణులు, రాజకీయ పార్టీలు విస్తృతంగా చర్చించాయి. అనంతరం అన్నారం, సుందిళ్ల బ్యారేజీల భద్రతపై కూడా పరిశీలనలు జరిగాయి. ఇప్పుడు ఎన్ డి ఎస్ ఏ, సి డబ్ల్యూ సి, హైకోర్టుకు సమర్పించిన తాజా వివరణలు కాళేశ్వరం వివాదాన్ని మరో దశకు తీసుకెళ్లాయి.

**హైకోర్టులో కేంద్ర సంస్థల కీలక వివరణ**
తెలంగాణ హైకోర్టులో దాఖలైన పిటిషన్‌లో కాళేశ్వరం ప్రాజెక్టుకు చెందిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలతో పాటు కాళేశ్వరం వ్యవస్థలోని ఇతర కీలక భాగాల సాంకేతిక భద్రతను సమగ్రంగా పరిశీలించి, వాటిలో ఏ భాగాన్ని సురక్షితంగా పరిమిత స్థాయిలోనైనా ఉపయోగించవచ్చో స్పష్టమైన నివేదిక ఇవ్వాలని కోరారు. ఈ నేపథ్యంలో హైకోర్టు కేంద్ర సంస్థల నుంచి వారి పరిధి, బాధ్యతలపై వివరణ కోరింది.
దానికి ప్రతిగా ఎన్ డి ఎస్ ఏ, సి డబ్ల్యూ సి తమ తమ అఫిడవిట్లను సమర్పించాయి. ప్రాజెక్టు నిర్వహణకు సంబంధించిన తుది ఆపరేషనల్ నిర్ణయం తమ వద్ద లేదని, రాష్ట్ర డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్, ప్రాజెక్టు యజమాని అయిన రాష్ట్ర ప్రభుత్వమే దీనిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని కేంద్ర సంస్థలు స్పష్టం చేశాయి. అయితే సాంకేతిక భద్రత, డ్యామ్ సేఫ్టీ ప్రమాణాలు, పునరుద్ధరణకు అవసరమైన మార్గదర్శకాలు అందించడం తమ పరిధిలో ఉంటుందని తెలిపాయి. ఈ వివరణ రాజకీయంగా అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. ఎందుకంటే కాళేశ్వరం ప్రాజెక్టును తిరిగి ఎప్పుడు నడపాలన్న విషయంలో రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎన్ డి ఎస్ ఏ , ఇతర సాంకేతిక సంస్థల సూచనలు, అనుమతుల కోసం ఎదురుచూస్తున్నట్లు పలుమార్లు పేర్కొంది. తాజా అఫిడవిట్లలో మాత్రం ఆపరేషన్‌కు సంబంధించిన తుది నిర్ణయం రాష్ట్ర పరిధిలోనే ఉందని కేంద్ర సంస్థలు చెప్పడంతో ఇప్పుడు ప్రభుత్వం ముందున్న బాధ్యత మరింత స్పష్టమైంది.

**ఎన్ డి ఎస్ ఏ చెప్పింది**
**పునరుద్ధరణ తప్పనిసరి అని**
అయితే కేంద్ర సంస్థలు రాష్ట్రానిదే ఆపరేషనల్ బాధ్యత అని చెప్పడం అంటే కాళేశ్వరం బ్యారేజీలను వెంటనే నడపవచ్చని అర్థం కాదు. ముఖ్యంగా మేడిగడ్డలో తలెత్తిన నిర్మాణ సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఎన్ డి ఎస్ ఏ ఇప్పటికే పునరుద్ధరణ, భద్రతా చర్యలపై స్పష్టమైన సాంకేతిక అభిప్రాయాలను వెల్లడించింది. 2023లో మేడిగడ్డలో పిల్లర్లు కుంగిన తర్వాత ఎన్డీఎస్ఏ ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ అక్కడి పరిస్థితులను పరిశీలించింది. సుప్రీంకోర్టు రికార్డులో నమోదైన వివరాల ప్రకారం, కమిటీ మేడిగడ్డలో ఏర్పడిన సమస్యలకు ప్రణాళిక, డిజైన్, నాణ్యత నియంత్రణ, ఆపరేషన్-మెయింటెనెన్స్ వంటి పలు అంశాల కలయిక కారణమై ఉండవచ్చని పేర్కొంది. ప్రస్తుత పరిస్థితిలో బ్యారేజీ పూర్తిస్థాయి పునరుద్ధరణ పొందే వరకు దాని పనితీరు తీవ్రంగా ప్రభావితమైందని, ప్రస్తుతం ఉన్న స్థితిలో రిజర్వాయర్‌ను నింపడం సమస్యను మరింత తీవ్రం చేసే అవకాశం ఉందని కమిటీ అభిప్రాయపడింది.
ఇదే కారణంగా ప్రభుత్వం కాళేశ్వరం వ్యవస్థను తిరిగి వినియోగించే విషయంలో జాగ్రత్తగా వ్యవహరిస్తోంది. మేడిగడ్డ సమస్యను పక్కనపెట్టి నీటిని నిల్వ చేయడం లేదా బ్యారేజీపై అదనపు హైడ్రాలిక్ ఒత్తిడి పెంచడం వల్ల భవిష్యత్తులో మరింత ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందన్న నిపుణుల ఆందోళనను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటోంది.

**అయితే అన్నారం, సుందిళ్ల పరిస్థితి ఏమిటి?**
ఇక్కడే తాజా పరిణామం మరో కీలక ప్రశ్నను ముందుకు తెచ్చింది. మేడిగడ్డలో తీవ్రమైన సమస్యలు బయటపడినప్పటికీ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పరిస్థితి కూడా అదే స్థాయిలో ఉందా? లేక వాటిలో కొంత భాగాన్ని అవసరమైన భద్రతా ప్రమాణాలతో వినియోగించగలమా? అన్న అంశంపై తాజాగా సాంకేతిక అధ్యయనాలు జరిగాయి.కేంద్ర జల, విద్యుత్ పరిశోధనా సంస్థ నిర్వహించినపరిశీలనలకు సంబంధించిన వివరాలపై తెలంగాణ టుడే నివేదిక ప్రకారం, అన్నారం, సుందిళ్లలో పెద్ద స్థాయి కాంక్రీట్ నాణ్యత సమస్యలు గుర్తించలేదని, మేడిగడ్డలో ప్రధాన నిర్మాణ సమస్య బ్లాక్-7 చుట్టూ కేంద్రీకృతమై ఉందని సాంకేతిక పరిశీలనలు సూచించాయి.

## సామాన్యుల ఆస్తుల పై ఆంక్షలెందుకు?

**హైదరాబాద్, మహా :** తెలంగాణలో 22ఏ నిషేధిత ఆస్తుల జాబితాపై రాజకీయ వివాదం కొనసాగుతోంది. చట్టబద్ధంగా కొనుగోలు చేసిన భూములు, ఇళ్ల స్థలాలు కూడా జాబితాలో చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ఈ అంశంపై న్యాయ విచారణ జరిపించాలని, పూర్తి శ్వేతపత్రం విడుదల చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. బాధితులు ఆస్తుల విక్రయం, రుణాలు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రభుత్వం చేసిన తప్పుల సవరణ కోసం ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పడం సరికాదన్నారు. మరోవైపు 22ఏ జాబితా ప్రభుత్వ, అసైన్డ్, ఇతర రక్షిత భూములను అక్రమ రిజిస్ట్రేషన్ల నుంచి కాపాడేందుకేనని ప్రభుత్వం చెబుతోంది.22ఏలో తప్పుగా చేర్చిన ప్రైవేటు ఆస్తులను వెంటనే తొలగించాలని బీఆర్ఎస్ కోరుతోంది. జాబితాలో ఎన్ని ఆస్తులు చేర్చారు, ఎన్ని తొలగించారు, కారణాలేమిటనే వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తోంది. ఈ వ్యవహారం భూ హక్కులు, రిజిస్ట్రేషన్లపై ప్రజల్లో ఆందోళనకు కారణమవుతోంది.






# కోదాడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం కంటైనర్‌ను ఢీకొట్టిన ప్రైవేట్ బస్సు

**అక్కడికక్కడే ఆరుగురు మృతి, మరో 20 మందికి గాయాలు**

హైదరాబాద్, మహా : హైదరాబాద్ విజయవాడ హైవేపై తెల్లవారు జామున ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు.. ముందు వెళ్తున్న కంటైనర్ డీసీఎం వాహనాన్ని వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సులోని ఆరుగురు ప్రయాణికులు స్పాట్ లోనే ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. కోదాడ మండలం దుర్గాపురం స్టేజీ సమీపంలో ఇవాళ తెల్లవారుజామున ఈ ప్రమాదం చోటు చేసుకుంది.అర్ధరాత్రి దాటిన తర్వాత ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు హైదరాబాద్ నుంచి ఏలూరుకు బయల్దేరింది. బస్సుకు ఇద్దరుడ్రైవర్లు ఉండగా. సూర్యాపేట సమీపంలో డ్రైవర్ ఛేంజ్ అయ్యారు. ఆ తర్వాత బస్సు బయల్దేరగా కోదాడ మండలం దుర్గాపురం స్టేజీ సమీపంలోకి చేరుకోగానే ముందు ఐరన్ రాడ్లతో వెళ్తున్న డీసీఎం వాహనాన్ని ఢీ కొట్టింది. బస్సు రైట్ యాక్సిడెంట్ కాగా ఐరన్ రాడ్లు బస్సులోపలికి దూసుకెళ్లాయి. ప్రమాద తీవ్రతకు బస్సు ముందు భాగం నుజ్జునుజ్జయింది. ఈ దుర్ఘటనలో ఆరుగురు ప్రయాణికులు స్పాట్ లోనే ప్రాణాలు కోల్పోగా.. మరో 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమయంలో బస్సులో ఇద్దరు డ్రైవర్లతో కలిపి మొత్తం 42 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రమాద ఘటన గురించి తెలుసుకున్న పోలీసులు, హైవే పెట్రోలింగ్ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకొన్నారు. సహాయక చర్యలు చేట్టి తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులను కోదాడ ప్రభుత్వ ఆసుపత్రితో పాటు విషమంగా ఉన్నవారిని మెరుగైన చికిత్స కోసం సమీపంలోని ఇతర ప్రైవేటు ఆసుపత్రులకు తరలించారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని.. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని డాక్టర్లు పోలీసులు తెలిపారు. రోడ్డు ప్రమాదంతో జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడగా పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. అతివేగం, డ్రైవర్ నిద్రమత్తు వల్లే ఈ ఘోర ప్రమాదం జరిగి ఉండవచ్చునని పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. కాగా, ప్రమాదానికి గల కారణాలు, మృతుల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మృతి చెందిన వారంతా ఏపీకి చెందిన వారని పోలీసులు తెలిపారు. మృతుల వివరాలు విజయవాడకు చెందిన లొల్లి పోగు మేరీ జ్యోత్స్న (39), భావన (25), పిడికిటి లక్ష్మీ (31), ఎన్టీఆర్ జిల్లా తెల్లప్రోలుకు చెందిన యాసారపు చిన్ని(31), భీమవరంకు చెందిన షకీనా (24), కృష్ణా జిల్లా పడమట పల్లికి చెందిన చెన్న కేశవుల నాగేంద్రబాబు (31) ఉన్నారు.

**దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి**

సూర్యాపేట జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని సీఎస్‌ను ఆదేశించారు. ప్రమాదంపై మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మాజీ మంత్రి, కేటీఆర్ స్పందించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ విచారం**

కోదాడ వద్ద చోటు చేసుకున్న ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతి చెందడంపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విచారం వ్యక్తం చేశారు. ప్రమాదానికి గల కారణాలను అధికారుల ద్వారా తెలుసుకున్నారు. ఈ ప్రమాదంలో మరో 11 మంది తీవ్రంగా గాయపడగా, నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు వివరించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, తెలంగాణ రాష్ట్ర అధికారులతో సమన్వయం చేసుకోవాలని సంబంధిత అధికారులకు పవన్ కళ్యాణ్ సూచించారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**ఏపీ రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి దిగ్భ్రాంతి**

ఘోర రోడ్డు ప్రమాదంపై ఏపీ రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో ఆరుగురు మృతికి సంతాపం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని మంత్రి సూచించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని మంత్రి ఆకాంక్షించారు. ప్రైవేటు బస్సు భద్రతా ప్రమాణాలు, డ్రైవర్ల అప్రమత్తత విషయంలో రాజీ పడకూడదన్నారు. రోడ్డు భద్రతా నిబంధనలు కచ్చితంగా పాటించేలా అధికారులు మరింత కఠినంగా పర్యవేక్షించాలన్నారు. ప్రయాణికుల భద్రతే అత్యంత ప్రాధాన్యతగా అన్ని బస్సుల యాజమాన్యం, డ్రైవర్లు వ్యవహరించాలని మంత్రి సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు మంత్రి ఆదేశించారు.

# 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్'కు తెలంగాణ ఆతిథ్యం

- కేంద్ర క్రీడామంత్రిత్వ శాఖ సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- రూ.22 కోట్లు విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వం
- హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్ లలో పోటీల నిర్వహణ
- దేశం నలుమూలల నుంచి పాల్గొననున్న 6వేలకు పైగా క్రీడాకారులు
- యువ క్రీడాకారులతో వర్చువల్‌గా మాట్లాడనున్న ప్రధాని నరేంద్రమోదీ




**న్యూఢిల్లీ, మహా :** భారతదేశ యువశక్తికి సరైన క్రీడా సదుపాయాలను, అవసరమైన ప్రోత్సాహాన్ని కల్పించి.. వారిలోని శక్తిసామర్థ్యాలకు పదునుపెట్టడంతోపాటుగా వారికి క్రీడా రంగంలో ఉజ్వలమైన భవిష్యత్తును అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తోంది. అందుకోసం గత 12 ఏళ్లుగా వివిధ కార్యక్రమాలతోపాటు పథకాలను తీసుకొచ్చింది. 'ఖేలో ఇండియా' కార్యక్రమం ద్వారా.. దేశంలోని యువ క్రీడాశక్తిని ప్రోత్సహించేందుకు దేశవ్యాప్తంగా.. 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్', 'ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్', 'ఖేలో ఇండియా పారా గేమ్స్', 'ఖేలో ఇండియా వింటర్ గేమ్స్', 'ఖేలో ఇండియా బీచ్ గేమ్స్', 'ఖేలో ఇండియా వాటర్ స్పోర్ట్స్ ఫెస్టివల్', 'ఖేలో ఇండియా ట్రైబల్ గేమ్స్' వంటి క్రీడా పోటీల నిర్వహణ ద్వారా క్రీడాకారులు తమలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను, తమలోని నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి ఒక వేదికను ఏర్పాటు చేసింది.ఇప్పటి వరకు జరిగిన 24 ఎడిషన్ల 'ఖేలో ఇండియా ' పోటీల్లో దేశం నలుమూలల నుంచి 60 వేల మందికిపైగా క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ పరంపరలో భాగంగా.. ఈ ఏడాది జరగనున్న 8వ ఎడిషన్ 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్' ను తెలంగాణలో నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్ వేదికగా ఈ పోటీలను నిర్వహించనున్నారు. ఈ ఎడిషన్‌లో మొత్తం 25 క్రీడల్లో పోటీలు నిర్వహించనున్నారు. ఆతిథ్య రాష్ట్రమైన తెలంగాణ.. ఒక స్థానిక క్రీడను ప్రతిపాదించవచ్చు. దీంతో పాటుగా మరో కొత్త క్రీడను కూడా ఈ ఈవెంట్లో ఆడించనున్నారు. ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 6వేల మంది క్రీడాకారులు పాల్గొంటారని అంచనా. ఈ 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్' నిర్వహణకోసం.. కేంద్ర ప్రభుత్వం రూ.22 కోట్లను విడుదల చేసింది. ఈ క్రీడా పోటీలను రాష్ట్ర ప్రభుత్వం, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎస్ఏఐ), నేషనల్ స్పోర్ట్స్ ఫెడరేషన్ (ఎన్ఎస్ఎఫ్), స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ జీఎఫ్ఐ), సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్, ఖేలో ఇండియా పథకం అడ్‌హక్ కమిటీ, స్టీరింగ్ కమిటీల సంయుక్త నిర్వహణలో నిర్వహించనున్నారు.

**కిషన్ రెడ్డి హర్షం**

ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను తెలంగాణకు కేటాయించడం పట్ల.. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి, కేంద్ర యువజన సర్వీసులు, క్రీడా శాఖల మంత్రి మన్‌సుఖ్ మాండవీయకు ధన్యవాదాలు తెలియజేశారు. భారత యువతలో అపారమైన క్రీడా ప్రతిభ ఉందని, వారికి తగిన క్రీడా సదుపాయాలు కల్పించడం, అవసరమైన ప్రోత్సాహాన్ని అందించడం, ప్రతిభను వెలితీయడంలో గత ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం వహించాయని విమర్శించారు. స్పోర్ట్స్ బడ్జెట్‌ను పూర్తిగా నిర్లక్ష్యం చేశాయని ఆరోపించారు. 2014లో కేంద్రంలో మోదీ ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన తర్వాత.. స్పోర్ట్స్ బడ్జెట్ కేటాయింపులు పెరిగాయని, ఖేలో ఇండియా వంటి పథకాల ద్వారా దేశంలోని మారుమూల ప్రాంతాలలో ఉన్న క్రీడా ప్రతిభకు సరైన ప్రోత్సాహం లభిస్తోందని పేర్కొన్నారు. 'ఖేలో ఇండియా' స్కీమ్‌లో భాగంగా.. తెలంగాణలో కూడా దాదాపు రూ.30 కోట్లతో క్రీడా సదుపాయాల కల్పన జరిగిందని, అందులో రూ.11.5 కోట్లతో ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో సింథటిక్ ట్రాక్, సింథటిక్ టెన్నిస్ కోర్ట్, మహిళల కోసం ప్రత్యేక స్విమ్మింగ్ పూల్ వంటి సౌకర్యాలను కల్పించారని, మరో రూ.18.5 కోట్లతో రాష్ట్రంలోని వివిధ పట్టణాలలో క్రీడా సదుపాయాలను కల్పించారని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణలో 33 ఖేలో ఇండియా సెంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నేషనల్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద మరో రూ.8.5 కోట్లను తెలంగాణలో క్రీడాభివృద్ధికి ఖర్చు చేశామన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఖేలో ఇండియా స్కీమ్, టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్, అసిస్టెన్స్ టు నేషనల్ స్పోర్ట్స్ ఫెడరేషన్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా స్కీమ్ వంటి పథకాలు క్షేత్రస్థాయిలో మంచి ఫలితాలనిస్తున్నాయి. తెలంగాణకు చెందిన అంతర్జాతీయ బాక్సర్ నిఖత్ జరీన్.. టాప్స్ ప్రోగ్రామ్ సహాయంతో ఇవాళ భారతదేశ కీర్తిపతాకను రెపరెపలాడిస్తోంది. ఈ పథకం ద్వారా ఆమెకు అత్యాధునిక శిక్షణతోపాటుగా అంతర్జాతీయ ఈవెంట్లలో పాల్గొని అనుభవం గడించేందుకు ప్రోత్సాహం లభించింది.తెలుగు తేజం.. బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు కూడా.. టాప్స్ కార్యక్రమం ద్వారా.. అంతర్జాతీయ స్థాయి శిక్షణ, సపోర్టింగ్ స్టాఫ్ సహకారంతో.. ఒలింపిక్స్ మెడల్ సాధించింది. క్రీడారంగంలో ఆమె రాణిస్తున్న తీరును ప్రోత్సహిస్తూ.. కేంద్ర ప్రభుత్వం 2015లో పద్మశ్రీ, 2020లో పద్మభూషణ్ అవార్డును అందించింది. ఇలాంటి క్రీడాకారులెందరికో.. కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. 2014కు ముందు మొత్తం 23 ఒలింపిక్స్ ఎడిషన్లలో.. 23 పతకాలు సాధించగా.. 2014 నుంచి 2024 వరకు మూడు ఎడిషన్లలో 15 పతకాలు సాధించారు. పారాలింపిక్స్‌లోనూ.. 2014కు ముందు దేశం కేవలం 8 పతకాలు సాధించగా.. 2014 నుంచి 2024 పారాలింపిక్స్ లో.. 52 పతకాలు సాధించాం. 2014కు ముందు దేశంలో స్పోర్ట్స్ బడ్జెట్ రూ.1,219 కోట్లుండగా.. 202526లో ఇది రూ.3,794 కోట్లకు పెరిగింది. దేశంలో 2014కు ముందు రూ.191 కోట్ల విలువైన 38 స్పోర్ట్స్ ప్రాజెక్టులుండగా.. ఈ 12 ఏళ్లలో 350 స్పోర్ట్స్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టులు పూర్తయ్యాయి. వీటి విలువ రూ.3,181 కోట్లు. మరో వైపు, ఆగస్టు 29న నేషనల్ స్పోర్ట్స్ డే ను పురస్కరించుకుని.. గురువారం (ఆగస్టు 27న).. దేశవ్యాప్తంగా 'ఖేల్ కీ బాత్, పీఎం కే సాథ్' పేరుతో ఖేలో ఇండియా సంవాద్ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా నిర్వహించనున్నారు. దేశ వ్యాప్తంగా ప్రతి జిల్లా నుంచి.. 2 కాలేజీల చొప్పున 1,500 లకు పైగా కాలేజీలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా క్రీడలు, ఫిట్‌నెస్‌తో పాటు యువత నేతృత్వంలో దేశ నిర్మాణానికి సంబంధించిన అంశాల మీద ప్రధాని మోదీ.. వర్చువల్‌గా ప్రసంగించడంతోపాటు క్రీడల పట్ల యువత ఆలోచనలు, ఆకాంక్షల గురించి వారితో మాట్లాడి తెలుసుకోనున్నారు.

# నేపాల్‌లో వరద బీభత్సం


- వెయ్యి మందికిపైగా గల్లంతు!
- గల్లంతైన వారిలో 105 మంది భారతీయులు.
- సహాయక చర్యలకు 15 హెలికాప్టర్లు



**కాఠ్మాండు, మహా:** నేపాల్‌లో భారీ వర్షాలు, ఆకస్మిక వరదలు తీవ్ర బీభత్సం సృష్టిస్తున్నాయి. టిబెట్ సరిహద్దు వైపు నుంచి ఒక్కసారిగా పోటెత్తిన వరద నీటితో భోటేకోశీ నది ఉద్ధృతంగా ప్రవహించడంతో నువాకోట్, ధాడింగ్, రసువా జిల్లాల్లోని పలు ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. వరద ఉద్ధృతికి గ్రామాలు, వంతెనలు, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు నీటిలో కొట్టుకుపోయాయి. రసువా జిల్లాలో బుధవారం ఉదయం సంభవించిన ఆకస్మిక వరదల్లో సుమారు వెయ్యి మంది నీటిలో కొట్టుకుపోయినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. గల్లంతైన వారిలో 105 మంది భారతీయులు ఉన్నట్లు సమాచారం అందడంతో ఆందోళన మరింత పెరిగింది.భోటేకోశీ నది ఒక్కసారిగా ఉగ్రరూపం దాల్చడంతో నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలకు ప్రాణభయం నెలకొంది. వరద ప్రవాహం ధాటికి ఇళ్లు, రహదారులు, వంతెనలు దెబ్బతినడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. టిబెట్ వైపు నుంచి వచ్చిన ఆకస్మిక వరదలే ఈ విధ్వంసానికి ప్రధాన కారణంగా అధికారులు భావిస్తున్నారు. పరిస్థితి వేగంగా విషమిస్తుండటంతో నదికి సమీపంలో నివసిస్తున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు యంత్రాంగం అప్రమత్తమైంది.వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను యుద్ధప్రాతిపదికన చేపట్టారు. బాధితులను గుర్తించి రక్షించేందుకు 15 హెలికాప్టర్లను రంగంలోకి దించారు. బుసితుసు ప్రాంతాల్లో సహాయక సిబ్బంది ఇప్పటివరకు 20 మందిని సురక్షితంగా రక్షించినట్లు అధికారులు తెలిపారు. వరదల్లో గాయపడిన వారిని మచిలి ట్రైనింగ్ క్యాంప్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. మరోవైపు గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఇప్పటివరకు ఎనిమిది మృతదేహాలను నీటిలో నుంచి వెలికితీసినట్లు అధికారులు వెల్లడించారు. వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందన్న హెచ్చరికల నేపథ్యంలో నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు ఏమాత్రం ఆలస్యం చేయకుండా సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని అధికారులు సూచించారు.భారీ వర్షాలు, ఆకస్మిక వరదలతో ఇప్పటికే అనేక ప్రాంతాల్లో సాధారణ జనజీవనం స్తంభించిపోయింది. గల్లంతైన వారిలో భారతీయులు కూడా పెద్ద సంఖ్యలో ఉన్నట్లు వస్తున్న సమాచారం నేపథ్యంలో వారి ఆచూకీ కోసం ప్రత్యేకంగా వివరాలు సేకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. సహాయక చర్యలు కొనసాగుతున్నప్పటికీ వరద ఉద్ధృతి, దెబ్బతిన్న రహదారులు, వంతెనల కారణంగా సహాయక బృందాలకు సవాళ్లు ఎదురవుతున్నాయి. మృతుల సంఖ్య, గల్లంతైన వారి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

# సుస్మిత వ్యాఖ్యలతో మాకు సంబంధం లేదు

- కాంగ్రెస్‌లోనే కొనసాగుతా.
- భట్టి విక్రమార్కతో ఎలాంటి చర్చ జరగలేదు.
- కొండా మురళి



**వరంగల్, మహా :** సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలతో తమకు ఎలాంటి సంబంధం లేదని కాంగ్రెస్ నేత కొండా మురళి స్పష్టం చేశారు. ఆమె తన అభిప్రాయాలను స్వతంత్రంగా వ్యక్తం చేసే హక్కు ఉందని, ఆమె వ్యాఖ్యలను ప్రశ్నించే హక్కు తమకు లేదని అన్నారు. సుస్మిత తనకు నచ్చిన విధంగా తన అభిప్రాయాలను వెల్లడించారని, ఎవరి అభిప్రాయాలు వారికి ఉంటాయని పేర్కొన్నారు. ఆమె చేసిన వ్యాఖ్యలు పూర్తిగా వ్యక్తిగతమైనవేనని స్పష్టం చేశారు.సుస్మిత చేసిన వ్యాఖ్యలపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో తాను ఎలాంటి చర్చ జరపలేదని కొండా మురళి తెలిపారు. "మా బిడ్డ చేసిన వ్యాఖ్యలతో మాకేం సంబంధం?" అని వ్యాఖ్యానించారు. పార్టీ కమిటీకి చెప్పాల్సిన విషయాలన్నింటినీ ఇప్పటికే వివరించామని, ఈ విషయంలో తమ వైపు నుంచి చెప్పాల్సింది ఏమీ లేదని పేర్కొన్నారు. తాను కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతానని ఆయన తేల్చిచెప్పారు.


పరకాలలో కొండా సురేఖ జన్మదిన వేడుకల సందర్భంగా సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ కాంగ్రెస్‌లో రాజకీయ ప్రకంపనలు రేపుతున్న నేపథ్యంలో కొండా మురళి తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యారని సుస్మిత విమర్శించడంతో పాటు, పరకాల అసెంబ్లీ టికెట్‌ను రేవూరి ప్రకాశ్‌రెడ్డికి ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. తనకు టికెట్ ఇవ్వకపోతే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని ప్రకటించడం పార్టీలో చర్చకు దారితీసింది.

సుస్మిత వ్యాఖ్యలను తెలంగాణ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ తీవ్రంగా పరిగణించింది. ఆమెపై చర్యలు తీసుకునే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సంకేతాలు ఇచ్చింది. అంతేకాకుండా ఆమె వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని పీసీసీ కొండా సురేఖను కోరాలని నిర్ణయించింది. అయితే సుస్మిత వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగత అభిప్రాయాలని కొండా సురేఖ ఇప్పటికే స్పష్టం చేశారు. తాజాగా కొండా మురళి కూడా అదే వైఖరిని వెల్లడించడంతో ఈ వ్యవహారంలో కొండా కుటుంబం పార్టీ అధిష్ఠానానికి తమ రాజకీయ వైఖరిని స్పష్టంగా తెలియజేసినట్లయింది.

సుస్మిత వ్యాఖ్యలపై పార్టీ అంతర్గతంగా చర్చ కొనసాగుతున్నప్పటికీ, తాను మాత్రం కాంగ్రెస్‌ను వీడే ప్రసక్తే లేదని కొండా మురళి స్పష్టం చేయడం రాజకీయంగా ఆసక్తికరంగా మారింది. పరకాల టికెట్ అంశం, సుస్మిత చేసిన వ్యాఖ్యలు, పార్టీ క్రమశిక్షణ కమిటీ స్పందన నేపథ్యంలో కాంగ్రెస్‌లో ఈ వ్యవహారం ఎలాంటి మలుపు తిరుగుతుందన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

# బెజవాడ రాజకీయాల్లో కొత్త ట్విస్ట్


- టీడీపీలోకి వంగవీటి ఆశా కిరణ్?
- మేయర్ రేసులో వంగవీటి వారసురాలు.
- కాపు ఓటు బ్యాంకుపై టీడీపీ గురి.
- విజయవాడ మేయర్ పీఠం దక్కేనా?



**విజయవాడ, మహా :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు, అందులోనూ విజయవాడ రాజకీయాలు ఎప్పుడూ రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తుంటాయి. దశాబ్దాలు గడుస్తున్నా బెజవాడ గడ్డపై 'వంగవీటి' అనే పేరుకు ఉన్న క్రేజ్, రాజకీయ ప్రాధాన్యత ఏమాత్రం తగ్గలేదు. దివంగత నేత వంగవీటి మోహన రంగా వారసత్వం చుట్టూ అల్లుకున్న రాజకీయాలు ఎప్పుడూ హాట్ టాపిక్‌గానే ఉంటాయి. తాజాగా బెజవాడ రాజకీయ చిత్రపటంలో మరో ఆసక్తికరమైన ఘట్టం ఆవిష్కృతం కాబోతోందన్న ప్రచారం ఊపందుకుంది. వంగవీటి రంగా కుమార్తె ఆశా కిరణ్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టబోతున్నారన్న వార్తలు ఇప్పుడు ఏపీ రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయిఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో, ముఖ్యంగా కృష్ణా జిల్లా పాలిటిక్స్‌లో వంగవీటి కుటుంబానికి ఒక ప్రత్యేకమైన అధ్యాయం ఉంది. రంగా కుమారుడు వంగవీటి రాధాకృష్ణ ఇప్పటికే పలు పార్టీలలో కొనసాగుతూ రాజకీయంగా తనదైన ముద్ర వేసే ప్రయత్నం చేస్తుండగా, ఇప్పుడు అనూహ్యంగా రంగా కుమార్తె ఆశా కిరణ్ పేరు తెరపైకి రావడం సర్వత్రా ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఆమె తెలుగుదేశం పార్టీకి దగ్గరవుతున్నారని, త్వరలోనే పసుపు కండువా కప్పుకోబోతున్నారనే ఊహాగానాలు బెజవాడ రాజకీయాల్లో జోరుగా సాగుతున్నాయి. గత కొంతకాలంగా తెరవెనుక రాజకీయాల్లో చురుకుగా ఉంటూ వస్తున్న ఆశా కిరణ్, ఇప్పుడు ప్రత్యక్ష వేదికపైకి వచ్చేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే ఆమె టీడీపీ అధిష్టానంతో ాటచ్‌లోకి వెళ్లారని, ఇరు వర్గాల మధ్య సానుకూల చర్చలు జరుగుతున్నాయని విశ్వసనీయ వర్గాల భోగట్టా.ఆశా కిరణ్ రాజకీయ ఎంట్రీ కేవలం ఒక సాధారణ అరంగేట్రంగా కాకుండా, ఒక స్పష్టమైన వ్యూహంతో సాగుతోందని విశ్లేషకులు భావిస్తున్నారు. బెజవాడ నడిబొడ్డున ఉన్న విజయవాడ నగరపాలక సంస్థ (మేయర్) పీఠంపై ఆమె కన్నేశారని తెలుస్తోంది. మేయర్ అభ్యర్థిగా బరిలోకి దిగడం ద్వారా తనకంటూ ఒక బలమైన రాజకీయ పునాదిని నిర్మించుకోవాలని, తండ్రి రాజకీయ వారసత్వాన్ని సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలని ఆమె యోచిస్తున్నట్లు స్పష్టమవుతోంది. తెలుగుదేశం పార్టీ కూడా ఈ ప్రతిపాదనను అత్యంత సానుకూలంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. విజయవాడ నగరంలో కాపు సామాజిక వర్గం ఓటు బ్యాంకు అత్యంత కీలకం అన్న విషయం తెలిసిందే. ఇన్నాళ్లు రంగా అభిమానులను, కాపు సామాజిక వర్గాన్ని ఏకతాటిపైకి తెచ్చేందుకు వివిధ పార్టీలు ఎన్నో ప్రయత్నాలు చేశాయి. ఇప్పుడు ఏకంగా రంగా కుమార్తెనే బరిలోకి దించితే, ఆ సామాజిక వర్గం ఓట్లను గంపగుత్తగా తమ వైపు తిప్పుకోవచ్చని తెలుగుదేశం పార్టీ వ్యూహరచన చేస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుత రాజకీయ సమీకరణాల్లో భాగంగా ఆశా కిరణ్ పేరు ప్రధానంగా వినిపిస్తోంది. స్థానికంగా ఉన్న రాజకీయ పరిస్థితులు, కాపు సామాజిక వర్గంలో వంగవీటి కుటుంబం పట్ల ఉన్న బలమైన సానుభూతిని తమకు అనుకూలంగా మలచుకునేందుకు టీడీపీ అధినాయకత్వం పకడ్బందీగా పావులు కదుపుతోంది. ఆశా కిరణ్‌కు మేయర్ వంటి కీలక పదవిని ఆఫర్ చేస్తే, అటు పార్టీకి బలమైన ఓటు బ్యాంకు అండగా నిలవడంతో పాటు, ఇటు ఆశా కిరణ్ రాజకీయ ప్రయాణానికి కూడా ఒక గొప్ప ఆరంభం లభిస్తుంది. ఇరు పక్షాలకు ఇది లాభసాటి వ్యూహం కావడంతో తెరవెనుక మంతనాలు తుది దశకు చేరుకున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.అయితే, రంగులు మార్చే రాజకీయ చదరంగంలో ఎప్పుడు ఏం జరుగుతుందో కచ్చితంగా చెప్పలేం. ప్రచారంలో ఉన్నట్లుగా వంగవీటి వారసురాలు నిజంగానే సైకిల్ ఎక్కుతారా? విజయవాడ మేయర్ రేసులో తెలుగుదేశం పార్టీ తరపున అధికారికంగా బరిలో నిలుస్తారా? ఆశా కిరణ్ ఎంట్రీతో కాపు సమీకరణాలు టీడీపీకి ఆశించిన స్థాయిలో ఫలితాలను ఇస్తాయా? అన్నది ఇప్పుడు అత్యంత ఉత్కంఠగా మారింది. ఆశా కిరణ్ తీసుకునే తదుపరి నిర్ణయం బెజవాడ రాజకీయ ముఖచిత్రాన్ని సమూలంగా మార్చే అవకాశం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు. ఆమె నిజంగానే టీడీపీ కండువా కప్పుకుని, మేయర్ రేసులో నిలిస్తే మాత్రం, బెజవాడ కార్పొరేషన్ ఎన్నికలు రాష్ట్రవ్యాప్తంగా కేంద్ర బిందువు కావడం ఖాయం. ఈ ఆసక్తికర రాజకీయ పరిణామంపై పూర్తి స్పష్టత రావాలంటే మరికొద్ది రోజులు వేచి చూడక తప్పదు.

# మంత్రి అడ్లూరికి ఎమ్మెల్యే పాయం వినతి

**భద్రాద్రి కొత్తగూడెం, మహా :** పినపాక నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేసి, రోడ్లు, వంతెనల నిర్మాణ పనులకు పరిపాలనా అనుమతులు కల్పించాలని రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, గిరిజన సంక్షేమ, వికలాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారత శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కోరారు.నియోజకవర్గంలోని మారుమూల, గిరిజన ప్రాంతాల్లో రోడ్లు, వంతెనలు సరిగా లేక ప్రజలు, రైతులు, విద్యార్థులు, రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే తెలిపారు. మణుగూరు, అశ్వాపురం, బూర్గంపాడు, కరకగూడెం, పినపాక, అల్లపల్లి, గుండాల మండలాల్లో పలు బీటీ రోడ్లు, హైలెవల్ వంతెనల నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.ఈ పనులకు త్వరితగతిన పరిపాలనా అనుమతులు మంజూరు చేసి, అవసరమైన నిధులు విడుదల చేయాలని మంత్రి అడ్లూరిని కోరినట్లు తెలిపారు. రోడ్లు, వంతెనల నిర్మాణంతో మారుమూల గ్రామాలకు మెరుగైన రవాణా సౌకర్యం అందడంతో పాటు రైతులు పంటలను మార్కెట్లకు తరలించేందుకు, విద్యార్థులు విద్యాసంస్థలకు వెళ్లేందుకు, అత్యవసర సమయాల్లో రోగులను ఆసుపత్రులకు తరలించేందుకు ప్రయోజనం కలుగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి కొనసాగిస్తానని పాయం వెంకటేశ్వర్లు తెలిపారు.





మహా పత్రిక





# సముద్ర తీరంలో జ్యోతి గ్లామర్

**సినీ నటి జ్యోతి పూర్వాజ్ (జ్యోతి రాయ్)** సోషల్ మీడియాలో మరోసారి సందడి చేస్తున్నారు. సముద్ర తీరంలో తీసుకున్న తాజా ఫొటోల్లో ఆమె ఎంతో గ్లామరస్‌గా, కాన్ఫిడెంట్‌గా కనిపిస్తూ అభిమానులను ఆకట్టుకుంటున్నారు. పింక్ కలర్ ఫ్లోరల్ బికినీతో పాటు షీర్ కవర్‌అప్ ధరించి, కళ్లకు సన్‌గ్లాసెస్ పెట్టుకుని, సముద్రపు అలల మధ్య జుట్టును వదిలేసి ఇచ్చిన పోజులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ ఫొటోలు చూసిన అభిమానులు ఆమె గ్లామర్‌తో పాటు స్టైలిష్ లుక్‌ను ప్రశంసిస్తున్నారు.కర్ణాటకలోని మడికేరికి చెందిన జ్యోతి పూర్వాజ్ తొలుత కన్నడ టెలివిజన్ రంగంలోకి అడుగుపెట్టారు. 'జోగుల' సీరియల్‌లో దేవకి పాత్రతో పాటు 'కిన్నరి', 'మూరు గంటు' వంటి సీరియల్స్‌లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే తెలుగువారికి మాత్రం 'గుప్పెడంత మనసు' సీరియల్‌తో మరింత దగ్గరయ్యారు. ఇందులో జగతి పాత్రలో ఆమె చూపించిన నటనకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. బలమైన భావోద్వేగాలతో కూడిన ఆ పాత్ర ఆమెకు ప్రత్యేకమైన అభిమానులను సంపాదించి పెట్టింది.

టెలివిజన్‌లో తనకంటూ గుర్తింపు తెచ్చుకున్న తర్వాత జ్యోతి సినిమాల వైపు అడుగులు వేశారు. తులు, కన్నడ చిత్రాలతో తన సినీ ప్రయాణాన్ని ప్రారంభించారు. 'బంగార్ద కురల్' (2012), 'మడిపు' (2017) వంటి చిత్రాల్లో నటించారు. ఆ తర్వాత 'డియా' (2020), 'జెర్సీ నంబర్ 10' (2023), 'సప్లయర్ శంకర' (2024) తదితర సినిమాల్లో కనిపించారు. విభిన్న భాషల్లో వరుస అవకాశాలు అందుకుంటూ దక్షిణాది సినీ పరిశ్రమలో తన పరిధిని క్రమంగా పెంచుకుంటున్నారు.ప్రస్తుతం జ్యోతి పూర్వాజ్ పలు ఆసక్తికరమైన ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. బహుభాషా సూపర్‌హీరో చిత్రంగా తెరకెక్కుతున్న 'మాస్టర్‌పీస్'లో ఆమె కీలక పాత్రలో నటిస్తున్నారు. అలాగే సైన్స్ ఫిక్షన్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న 'కిల్లర్'లోనూ కనిపించనున్నారు. ఈ సినిమాను ఆమె భర్త సుకు పూర్వాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. 'కిల్ఆర్', 'కిల్లర్: డ్రీమ్ గర్ల్' పేర్లతోనూ ఈ చిత్రానికి ప్రచారం జరుగుతోంది. ఇందులో జ్యోతి పలు కోణాలతో కూడిన విభిన్న పాత్రల్లో కనిపించనున్నట్లు సమాచారం.'హల్కా డాన్' వంటి మరికొన్ని ప్రాజెక్టులతోనూ జ్యోతి పేరు వినిపిస్తోంది. టెలివిజన్ నుంచి సినిమాల వైపు అడుగులు వేసిన ఆమె ప్రస్తుతం గ్లామర్‌తో పాటు నటనకు ప్రాధాన్యమున్న పాత్రలను ఎంచుకుంటూ ముందుకు సాగుతున్నారు. సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉంటూ తన ఫొటోలు, వ్యక్తిగత అప్‌డేట్స్‌ను అభిమానులతో పంచుకుంటున్నారు. దీంతో జ్యోతి పూర్వాజ్‌కు సంబంధించిన ప్రతి కొత్త ఫొటో, సినిమా అప్‌డేట్ సోషల్ మీడియాలో ఆసక్తిని రేకెత్తిస్తోంది.



# నాగార్జున 100వ సినిమాపై భారీ అంచనాలు

టాలీవుడ్ కింగ్ అక్కినేని నాగార్జున తన కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న 100వ చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. 'కింగ్100'గా ప్రచారంలో ఉన్న ఈ సినిమాను అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం సినిమా షూటింగ్ వేగంగా కొనసాగుతోంది. యువ దర్శకుడు రా కార్తీక్ ఈ చిత్రంతో దర్శకుడిగా టాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్నారు.నాగార్జున పుట్టినరోజు ఆగస్టు 29 సందర్భంగా సినిమాకు సంబంధించిన కీలక అప్‌డేట్‌ను విడుదల చేసేందుకు మేకర్స్ సిద్ధమయ్యారు. ఆ రోజున మూవీ టైటిల్ గ్లింప్స్‌ను అభిమానుల ముందుకు తీసుకురానున్నారు. నాగార్జున 100వ సినిమా కావడంతో టైటిల్ ఎలా ఉండబోతుందనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. పుట్టినరోజు కానుకగా వచ్చే గ్లింప్స్‌పై ఇప్పటికే సోషల్ మీడియాలో భారీ అంచనాలు కనిపిస్తున్నాయి.ఈ సినిమాలో నాగార్జునతో పాటు సీనియర్ హీరోయిన్ టబు కీలక పాత్రలో నటిస్తున్నట్లు సమాచారం. గతంలో 'నిన్నే పెళ్లాడతా', 'ఆవిడా మా ఆవిడే' వంటి చిత్రాల్లో నాగార్జున, టబు జోడీ ప్రేక్షకులను ఆకట్టుకుంది. చాలా కాలం తర్వాత ఈ కాంబినేషన్ మళ్లీ తెరపై కనిపించనుండటంతో సినిమాపై మరింత ఆసక్తి పెరిగింది. ఇక ఈ ప్రతిష్టాత్మక చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. నాగార్జున, దేవిశ్రీ ప్రసాద్ కాంబినేషన్‌లో గతంలో వచ్చిన పాటలు మంచి ఆదరణ పొందడంతో ఈ మూవీ ఆల్బమ్‌పై కూడా అంచనాలు పెరిగాయి. అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో సినిమాను రూపొందిస్తున్నట్లు చిత్ర బృందం చెబుతోంది.ఆగస్టు 29న విడుదల కానున్న టైటిల్ గ్లింప్స్‌లో సినిమా టైటిల్‌తో పాటు ఇతర కీలక వివరాలను కూడా వెల్లడించే అవకాశం ఉంది. భారీ తారాగణం, సాంకేతిక నిపుణుల వివరాలను కూడా మేకర్స్ అదే సమయంలో ప్రకటించనున్నట్లు తెలుస్తోంది. నాగార్జున మైల్‌స్టోన్ మూవీ కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోంది.





# 'ఓజీ'పై ఇమ్రాన్ హష్మి ఆసక్తికర వ్యాఖ్యలు

పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ సెకండ్ ఇన్నింగ్స్‌లో భారీ అంచనాలు ఏర్పరిచిన చిత్రాల్లో 'ఓజీ' ఒకటి. సినిమా ప్రకటన వచ్చినప్పటి నుంచే పవన్ అభిమానుల్లో భారీ ఉత్కంఠ నెలకొంది. సాధారణ ప్రేక్షకుల్లోనూ ఈ మూవీపై ఆసక్తి పెరిగింది. ముఖ్యంగా బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మి ప్రతినాయకుడి పాత్రలో కనిపించడం సినిమాకు మరింత హైప్ తీసుకొచ్చింది. ఓమి పాత్రలో ఇమ్రాన్ తనదైన స్టైల్‌తో ఆకట్టుకున్నారు.అయితే సినిమా విడుదల సమయంలో ఇమ్రాన్ హష్మి 'ఓజీ' గురించి పెద్దగా మాట్లాడలేదు. సాధారణంగానే తన సినిమాల ప్రమోషన్‌కు దూరంగా ఉండే ఆయన మీడియా ఇంటర్వ్యూలకు కూడా పరిమితంగానే హాజరవుతుంటారు. తాజాగా మాత్రం 'ఓజీ' గురించి ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. సినిమా విడుదలై చాలా కాలం గడిచిన తర్వాత తన పాత్రపై ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఇమ్రాన్ హష్మి నటించిన 'ఆవారాపన్ 2' మంచి ఓపెనింగ్స్‌తో దూసుకెళ్తున్న నేపథ్యంలో ఆయన వరుసగా ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. ఈ సందర్భంగా ఓ తమిళ క్రిటిక్‌తో జరిగిన ఇంటర్వ్యూలో 'ఓజీ' గురించి మాట్లాడారు. ఈ సినిమాలో నటించే అవకాశం రావడం తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని చెప్పారు. ముఖ్యంగా తెలుగు సినిమాలో నటిస్తానని తాను గతంలో ఎప్పుడూ ఊహించలేదని, అయితే 'ఓజీ' కథ, తన పాత్ర నచ్చడంతో వెంటనే అంగీకరించినట్లు తెలిపారు.దర్శకుడు సుజీత్ పనితీరుపై కూడా ఇమ్రాన్ ప్రశంసలు కురిపించారు. సుజీత్ ఎంతో ఎనర్జీతో, విభిన్నమైన ఆలోచనలతో సినిమా తెరకెక్కించారని పేర్కొన్నారు. యాక్షన్ సన్నివేశాలతో పాటు పాత్రలను స్టైలిష్‌గా చూపించిన విధానం తనకు బాగా నచ్చిందన్నారు. 'ఓజీ'లో భాగం కావడాన్ని తాను ఎంతో ఆస్వాదించానని, ఈ సినిమా తన కెరీర్‌లో ప్రత్యేకంగా నిలిచిందని ఇమ్రాన్ చెప్పుకొచ్చారు.ఇదిలా ఉండగా 'ఓజీ'కి సీక్వెల్ వచ్చే అవకాశాలపై ఇప్పటికే ఆసక్తి నెలకొంది. మొదటి భాగంలో ఇమ్రాన్ పోషించిన ఓమి పాత్రకు ముగింపు రావడంతో రెండో భాగంలో కొత్త విలన్ కనిపించే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది. దీంతో 'ఓజీ 2'లో ప్రతినాయకుడి పాత్రను ఎవరు పోషిస్తారన్నది కూడా అభిమానుల్లో ఆసక్తికర అంశంగా మారింది.

# చీరకట్టులో మెరిసిన మిథిలా పాల్కర్

మిథిలా పాల్కర్ తన సహజమైన అందం, సింపుల్ యాక్టింగ్ స్టైల్, ఆకట్టుకునే చిరునవ్వుతో ప్రేక్షకుల మనసులను గెలుచుకుంటూనే ఉంది. ఎలాంటి ఓవర్ యాక్షన్ లేకుండా సహజంగా నటిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ భామ.. తొలుత డిజిటల్ కంటెంట్ ద్వారా పాపులర్ అయింది. ఆ తర్వాత వెండితెరపైకి అడుగుపెట్టి పలు భాషల్లో విభిన్నమైన పాత్రలు చేస్తూ తన నటనా ప్రతిభను చాటుకుంది.మిథిలా పాల్కర్ సినీ ప్రయాణంలో 'కట్టి బట్టి' సినిమా ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఈ రొమాంటిక్ కామెడీ డ్రామాతో ఆమె హిందీ చిత్ర పరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత మరాఠీ సినిమా 'మురంబా'లో ప్రధాన పాత్రలో నటించి మంచి ప్రశంసలు అందుకుంది. ఈ చిత్రంలో ఆమె చూపించిన సహజమైన నటన ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో పాటు విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు దక్కాయి. విభిన్నమైన కథలు, పాత్రలను ఎంచుకుంటూ తన కెరీర్‌ను నెమ్మదిగా కానీ స్థిరంగా ముందుకు తీసుకెళ్తోంది.ఇక సినిమాలతో పాటు సోషల్ మీడియాలోనూ మిథిలా పాల్కర్ ఫ్యాషన్ సెన్స్ అభిమానులను ఆకర్షిస్తోంది. ముఖ్యంగా సంప్రదాయ దుస్తుల్లో ఆమె కనిపించే తీరు ప్రత్యేకంగా ఉంటుంది. తాజాగా మోటిఫ్ ప్రింట్లతో కూడిన అందమైన చీరను సంప్రదాయ పద్ధతిలో కట్టుకుని, మెడలో ఎత్నిక్ గోల్డ్ జ్యువెలరీ, చెవులకు సంప్రదాయ ఆభరణాలు ధరించి కనిపించింది. జడలో గజ్రా అలంకరణ ఆమె లుక్‌కు మరింత అందాన్ని తీసుకొచ్చింది. సింపుల్‌గా ఉన్నప్పటికీ ఎంతో గ్రేస్‌ఫుల్‌గా కనిపించే ఈ లుక్‌లో మిథిలా పాల్కర్ మరోసారి తన ప్రత్యేకమైన స్టైల్‌తో ఆకట్టుకుంది. సంప్రదాయ అందాన్ని ఆధునిక సొబగులతో మేళవిస్తూ ఆమె చేసిన ఈ ఫ్యాషన్ ఎంపికకు అభిమానుల నుంచి మంచి స్పందన వస్తోంది. కెమెరా ముందు సహజమైన నటనతో మెప్పించే మిథిలా.. కెమెరా వెలుపల కూడా తన సింప్లిసిటీ, సంప్రదాయ ఫ్యాషన్‌తో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.



# నటి ఫిర్యాదుతో దర్శకుడు అరెస్ట్

హైదరాబాద్‌లో టాలీవుడ్ దర్శకుడు పవన్ సాధినేనిని పోలీసులు అరెస్ట్ చేసినట్లు సమాచారం. ఓ నటి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. సినిమా అవకాశాలు ఇప్పిస్తానని చెప్పి మోసం చేశారని, వ్యక్తిగత విషయాల్లోనూ నమ్మించి దూరంగా ఉన్నారని నటి ఆరోపించినట్లు సమాచారం. కోర్టులో హాజరుపరచగా జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం దుల్కర్ సల్మాన్ హీరోగా 'ఆకాశంలో ఒక తార' చిత్రాన్ని పవన్ సాధినేని తెరకెక్కిస్తున్నారు. కేసుపై పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.



EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com. PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034